క్లుప్తంగా

నేటి నుంచి చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు

కొడంగల్ : నందవరం చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు జల్దిబిందె, రాత్రి 7 గంటలకు పంచామృతాభిషేకం, 8 గంటలకు భజన కార్యక్రమాలు, 11న గురువారం ఉదయం 5 గంటలకు జ్యోతి ఉత్సవాలు, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం, 12వ తేదీ శుక్రవారం ఉ.10 గంటలకు పెరుగు బసంతం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సంకారపు పవన్‌కుమార్, సంకారపు శివకుమార్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి డికె అరుణ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఇప్పటికే బూత్‌లెవల్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ నర్సింలు, మండల అధ్యక్షుడు సతీష్, నాయకులు రాముల, అశోక్, మోహన్‌రెడ్డి, బుగ్గప్ప, అంజి, కృష్ణారెడ్డి, శ్రీశైలం తదితరులున్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



స్నేహితులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులు

దోమ : మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు నిలుస్తోందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బొంపల్లి గ్రామంలో 2009–10 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముస్లిం సోదరులు రంజాన్ మాసాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారని అన్నారు. ముస్లిం సోదరులు ఇచ్చే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. అనంతరం పూర్వ విద్యార్థులు తోటి స్నేహితులకు పండ్లు, పలహారాలను తినిపించి ఉపవాస దీక్షలను విరమింపచేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల యువకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న అవినాష్‌రెడ్డి

ధారూరు: మండల కేంద్రంలో మంగళవారం ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ధారూరు మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో యువత కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయం కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు లింగనపల్లి అశోక్‌ముదిరాజ్, కార్తీక్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పల్లకీలో ఊరేగుతున్న సాయిబాబా

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని ఐనాపూర్ గ్రామ సమీపంలోని షిరిడి సాయిబాబా ఆలయ సప్తమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు చేయడంతో పాటు లక్ష్మీ గణపతి సహా సకల దేవతా హోమాలు చేపట్టారు. అనంతరం సాయిబాబా పల్లకీ సేవ చేపట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా ఉగాది సంబురాలు



యాలాల: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు



వికారాబాద్: కవి సమ్మేళనంలో వేదపండితులు సాంబశివశర్మ



దోమ: బొంపల్లిలో పంచాగ పఠనం చేస్తున్న అర్చకులు



బంట్వారం: పంచాంగ శ్రవణం వింటున్న గ్రామస్తులు

ఉగాది పర్వదినాన్ని ప్రజలు సంతోషంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల దేవాలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి, క్రోధి నామ సంవత్సరం అన్ని శుభాలే జరగాలని భగవంతుడిని వేడుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచాంగం చదివి ప్రజలకు వినిపించారు. అనంతరం షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడిని ప్రజలు ఆరగించారు.



అనంతగిరి: ఉగాది వేడుకలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు



తాండూరు రూరల్: అంతారంలో..



పెద్దేముల్‌లో పంచాంగం చదువుతున్న పురోహితులు



కుల్కచర్ల: పంచాంగ శ్రావణంలో పాల్గొన్న గ్రామస్తులు



మర్పల్లి : పంచాంగ పఠనం చేస్తున్న కైలాస్ పంతులు



పంచాంగం చదువుతున్న జయతీర్థాచారి



ధారూరులో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు



పెద్దేముల్‌లో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న పురోహితులు



వికారాబాద్: పంచాంగం వింటున్న ప్రముఖులు

చదువుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

పరిగి: ప్రథం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని నజీరాబాద్‌తండాలో విద్యాపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి విద్యనభ్యసించాలంటే తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎల్లప్పుడు ఉండాలన్నారు. తల్లిదండ్రుల వద్దే ఎక్కువ సమయం పిల్లలు గడుపుతుంటారు. కావునా వారిపై దృష్టి పెట్టాలన్నారు. అలాగే, విద్యాభివృద్ధికి వేసవి శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కథలు, ఇతర అన్ని రకాల పుస్తకాలను అందజేస్తామన్నారు. విద్యతో సమాజం బాగుంటుందని వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రంజాన్ మాసం ఎంతో పవిత్రమైంది..

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వెంకట్‌రెడ్డి

మొయినాబాద్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా మజీద్‌లో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ ఎంతో పవిత్రమైందన్నారు. కులమతాలకు అతీతంగా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ్మారెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, ఎండీ ఆజం, అమీర్, షఫీ, ఇక్బాల్, లతీఫ్, అతిక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నీటిని తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోండి

కొందుర్గు: చెరువులో నుంచి అక్రమంగా నీళ్లు తీసుకెళ్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన జంబుల పెద్ద యాదయ్య గ్రామ శివారులోని కర్దం కుంటలో మోటర్ అమర్చి తన వ్యవసాయ పొలానికి నీళ్లు మళ్లిస్తున్నాడని పేర్కొన్నారు. దీంతో కుంటలో నీళ్లు అయిపోయి పశువులకు తాగడానికి కూడా నీళ్లు ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇదివరకే తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దాహార్తిని తీర్చేవే చలివేంద్రాలు



చలివేంద్రాన్ని ప్రారంభించిన సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సత్యసాయి సేవాసమితి సభ్యులు

- చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి
- సత్యసాయిబాబా చూపిన మార్గం అనుసరణీయం

చేవెళ్ల: దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని సీఐ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందు శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సేవా సమితి సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎండల తీవ్రతకు బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారికి, ఇతర పనులపై ప్రయాణం చేస్తున్నవారికి రోడ్డుపై ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాలతో దాహాన్ని తీర్చుకోవచ్చన్నారు. ప్రతిఒక్కరూ తమకు తోచిన విధంగా ఏదో ఒక సహాయం అందించాలని కోరారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా కూడా ఎంతో మందికి తన ట్రస్టు ద్వారా సేవలు అందించే ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. సత్యసాయిబాబా చూపించిన మార్గాలు అందరికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సేవా సమితి సభ్యులు గోపాలచారి, రామగౌడ్, భాస్కర్, పెంటారెడ్డి, వెంకటస్వామి, విఠల్, శంకర్, మధుసూదన్, చేవెళ్ల శాఖ సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆశలు చిగురిస్తాయా.. ఆవిరవుతాయా?

- కాల్వలకు ఎక్కని నీరు
- పంటలు ఎండు ముఖం
- ఆందోళనలో అన్నదాతలు
- నీరు పెట్టకుంటే వరి పైరు ఎండిపోవడం ఖాయం

ధారూరు: ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసిన రైతులకు చివరి ఆయకట్టుకు సాగునీరందక ఆశలు ఆవిరవుతున్నాయి. మండుతున్న ఎండకు చెరువులు, ప్రాజెక్టులు, బారుబావుల్లోని భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో మండలంలోని రైతులు సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి వస్తుందా? లేదా అనే ఆవేదనలో రైతన్న నిరాశ చెందుతున్నాడు.. ఓ యువ రైతు ఆయకట్టు కాల్వలోకి తొంగిచూడటం, కాల్వలో నీరు లేకపోవడంతో పంట పొలానికి నీరెలా పెట్టాలని దిగాలుగా చూస్తున్నాడు. ఈ సంఘటన ధారూరు మండలంలోని గట్టెపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కోట్‌పల్లి ప్రాజెక్టు ఎడమ కాల్వ రైతులు వరి, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ,



నీరు రాకపోవడంతో దిగాలుగా చూస్తున్న యువరైతు

పశుగ్రాసాన్ని సాగు చేశారు. ఈ పొలాలకు ప్రాజెక్టు నీరు ముందుగా రుద్రారం చెరువును నింపిన తర్వాత గట్టెపల్లి వైపు రావాలి. కాల్వకు పడిన గండ్లు వదిలిన నీటిలో కొంత లాగేసుకుంటుంది. కొద్ది మొత్తంలో వస్తున్న నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులు ప్రయత్నించిన సాధ్యపడటం లేదని వాపోతున్నారు. ఈ కాల్వకు చివరి సాగు భూములకు సరిగ్గా నీరు అందక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండుతున్న ఎండలకు వరికి పెట్టిన నీరు పెట్టినట్లే ఎండిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కాల్వకు ముందున్న రైతులు కాల్వకు అడ్డంగా రాళ్లు, మట్టి వేసి నీటిని మళ్లించి పొలాలు పారించుకుంటుండగా చివరి భూముల రైతుల పొలాలకు నీరందక పంటలు ఎండుముఖం పట్టాయి. మరో రెండు రోజుల్లో నీరందకపోతే పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎడమ కాల్వ తూమును కొద్దిగా పైకిలేపి తగిన మోతాదులో కాల్వలోకి నీరు వస్తే అందరి పంట పొలాలకు నీరందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, కాల్వకు ముందున్న రైతులు నీరు రాకుండా అడ్డుకట్ట వేస్తే చివరగా ఉన్న రైతులు నీటి కోసం రాత్రి పగలు తేడా లేకుండా పొలాల వద్దే కాపలా కాస్తున్నారు.

పక్కాగా.. పకడ్బందీగా



వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు(ఫైల్)

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద పోలీసులు ముమ్మరం తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నియమావళి అమలులో ప్రత్యేక బృందాలు, పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడం.. సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- ఎన్నికల నేపథ్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీ
- రూ.50వేలకు మించి నగదు తరలిస్తే ఆధారాలు తప్పనిసరి
- పెళ్లిళ్ల సీజన్ కావడంతో పరేషాన్

దౌల్తాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసిన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకుండా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే పోలీస్‌శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. నగదు అక్రమ రవాణా, మద్యం పంపిణీకి అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టారు. కాగా ఎన్నికలు సమీపిస్తుండడంతో అన్ని పార్టీల నేతలు ఇప్పటికే ప్రచారాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని చంద్రకల్ గ్రామం వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన నిఘా పెంచినట్లు పోలీసులు తెలిపారు.

సామాన్యుడి పరేషాన్..

ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉండడం, ఆంక్షలు విధించడం శుభాకార్యాలపై ప్రభావం చూపుతున్నాయి. వివాహాల సందర్భంగా నూతన వస్త్రాలు బంగారం ఇతర వస్తువుల కొనుగోలు చేయడం, నిత్యావసర వస్తువులు, వాహనాలు, ఇతర సామగ్రి కొనుగోలు చేయడం ఫంక్షన్ హాళ్లు ఇలా అన్నింటికీ పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం ఉంటుంది. రూ.50వేల కంటే మించి నగదు తీసుకువెళ్తే సీజ్ చేయడం ఇబ్బందిగా మారిందని పలువురు వాపోతున్నారు. నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపకపోయినా వెండి, బంగారు ఆభరణాలు పెద్ద మొత్తంలో తీసుకెళ్తున్నా స్వాధీనం చేసుకుంటున్నారు. దీంతో సామాన్యులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

నగదు పట్టుబడిన ఘటనలు..

- ▲ మార్చి 25న కర్నాటక నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారులో రూ. లక్ష నగదును సీజ్ చేశారు.
- ▲ మార్చి 29న 1.44లక్షలు సీజ్ చేశారు.
- ▲ ఏప్రిల్ 5న రూ.1.17లక్షలు సీజ్ చేశారు.
- ▲ గత నాలుగు రోజుల క్రితం రూ.1,68,500, 46 గ్రాముల బంగారం, 2కిలోల వెండి స్వాధీనం చేసుకున్నారు.
- ▲ రెండు రోజుల క్రితం రూ.2లక్షల 10వేలు నగదును ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తుంటే సీజ్ చేశారు.

వీరశైవ లింగాయత్‌ల అభ్యున్నతికి కృషి



నియామక పత్రం అందిస్తున్న సంఘం సభ్యులు

- కర్నె శివప్రసాద్
- చేవెళ్లలో మండల కమిటీ సమావేశం

చేవెళ్ల: వీరశైవ లింగాయత్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని సంఘం మండల నూతన అధ్యక్షుడిగా నియామకమైన కర్నె శివప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు. ముందుగా వీరశైవలింగాయత్‌ల ఆరాధ్యదైవం బసవేశ్వరుని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో మండల ఘంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులంతా కలిసి అధ్యక్షుడిగా కర్నె శివప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీరశైవ లింగాయత్‌లు అన్ని రంగాల్లో రాణించేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో సంఘం సభ్యులంతా ఏకతాటిపై సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వీరే మండల నూతన కమిటీ సభ్యులు..

వీరశైవలింగాయత్ సంఘం నూతన మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జె. వీరేశం(కుమ్మెర), ప్రధాన కార్యదర్శి జంగం ప్రసాద్(ఊరేళ్ల), కోశాధికారి కె వీరరేశం(ఊరేళ్ల), కార్యదర్శిగా కె విశ్వనాథం(కందవాడ), గౌరవ అధ్యక్షుడిగా ఎం ప్రభులింగం(చేవెళ్ల), నాగేంద్రబాబు (ఊరేళ్ల), సలహాదారులుగా జె శివనాందం (చనువెల్లి), కె రమేశ్(ఊరేళ్ల), కార్యవర్గ సభ్యులుగా సంఘమేశ్వర్, కె రాజు, రామలింగప్ప, భద్రప్ప, తుమ్మలపల్లి వినయ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.